బుద్దారంలో తాగునీటి సమస్య


బుద్దారంలోని బలరాంప్లాట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

- 150 ఇళ్లకు ఏళ్లుగా ఇబ్బందులే..
- రెండు నెలలుగా సమస్య మరింత తీవ్రం
- 'భగీరథ' నీరు వచ్చేది నాలుగు బిందెలే

బుద్దారం గ్రామ జనాభా	6,250	
కుటుంబాలు	బోరుబావులు	పని చేసేవి
920	8	7
ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు	మినీ ట్యాంకులు	
4	3	
కావాల్సిన నీరు	4.70 లక్షల లీటర్లు	

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గ్రామాన్ని తాగునీటి సమస్య పీడిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా ఎత్తు ప్రాంతంలో ఉన్న పిల్లిగుండ్ల మిట్ట కాలనీకి చెందిన సుమారు 150 నుంచి 200 ఇళ్లకు, బలరాంరెడ్డి ప్లాట్లలో సుమారు నలభై ఇళ్లకు మిషన్ భగీరథ, బోరు నీరు సరిగా అందడం లేదు. దీంతో దిగువ ప్రాంతంలో ఉన్న ఇళ్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి ఉంది. సమస్య ఏళ్లుగా ఉన్నా.. పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. దిగువ ప్రాంతంలో సైతం మిషన్ భగీరథ నీరు కేవలం ఎనిమిది బిందెల లోపలే వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు.



ఎమ్మెల్యే నిధులతో బోర్లు

ఇటీవల సమస్యను ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.మూడు లక్షలు మంజూరు చేయించి రెండు బోర్లు వేయించారు. పది నుంచి పదిహేను రోజులు కావస్తోంటే ఒక బోరులో మోటారు దింపినా.. ప్రజలకు నీరు అందించడం లేదు. మరో బోరులో మూడు ఇంచుల నీరు పడినా కూడా మోటారు దింపలేదు. ఉన్నతాధికారులు ఇప్పటికై నా స్పందించి బుద్దారంలో అందరికీ మిషన్ భగీరథ తాగునీరు అందుబాటులోకి వచ్చేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.


ఎమ్మెల్యే నిధులతో 10 రోజుల క్రితం బోరు

రెండు నెలలుగా..



రెండు నెలలుగా మాకు తాగునీరు రావడం లేదు. దీంతో పక్కనున్న కాలనీకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. మా ప్రాంతం మిట్ట ప్రాంతంగా ఉండడం, రోడ్డు దాటి నీళ్లు తెచ్చుకోవాల్సి రావడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నాం. మిషన్ భగీరథ నీరు రాకున్నా ఫర్వాలేదు. వాడుకునేందుకు బోరు నీరు వచ్చినా సంతోషమే. అధికారులు మాకు నీరు ఏర్పాటు చేయాలి.

– తిరుపతమ్మ, బుద్దారం

మూసి ఉన్న ఇళ్ల వద్ద..



మా ఇళ్ల వద్ద నీరు రావడం లేదు. మాకు దగ్గరలో ఉన్న కాలనీలో ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఇళ్ల వద్ద ఉన్న సంపుల్లో నీరు ఉంటే మేము తీసుకెళ్తున్నాం. ఏళ్లుగా ఈ సమస్య ఉంది. తాగడానికి నీరు రాకపోవడంతో బయట రూ.పది పెట్టి కొంటున్నాం. మాకు వాడుకోవడానికి నీరు వచ్చినా బాగుంటుంది. ఎన్నిసార్లు అడిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– సాయిరాం, బుద్దారం

చర్యలు తీసుకుంటున్నాం



బుద్దారంలో సమస్య ఉంటే ఇప్పటికే రెండు బోర్లు వేశాం. ఒక బోరులో మోటారు దింపాం. తొందర్లోనే ప్రజలకు బోరు ద్వారా నీటిని అందిస్తాం. అవసరం అయితే మరో బోరు వేస్తాం. ఇంకా అవసరం అయితే ట్యాంకరు ద్వారా అయినా ప్రజలకు తాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– శేఖర్, ఎంపీడీఓ, గోపాల్‌పేట

పంచాయతీ కార్మికుల నిరసన


జమ్మాపూర్‌లో నిరసన తెలుపుతున్న కార్మికులు

పాన్‌గల్: ఖమ్మం జిల్లా కొనిచర్ల మండలం అంజనాపురం గ్రామ పంచాయతీ గుమస్తా భూక్యప్రసాద్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసుకొని చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం జీపీల ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల నాయకులు సుగ్రీవుడు, యాదగిరి, కిషన్‌నాయక్, ఎల్లస్వామి మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలపై పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించిన గుమస్తా భూక్యప్రసాద్‌ను పనిలోకి రావద్దని, వస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని బెదిరించి పనిలో నుంచి పంపించి వేయడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. ఆత్మహత్యాయత్నానికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై తగు చర్య తీసుకుంటూ అతనికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సురేష్, తిరుపతయ్య, చంద్రశేఖర్, బాలస్వామి, అర్జునయ్య, ఎల్లమ్మ, భాగ్యమ్మ, కృష్ణమ్మ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

వనపర్తి టౌన్: తెలంగాణ జర్నలిస్ట్ వర్కింగ్ అఫ్ యూనియన్ (హెచ్–143) వనపర్తి జిల్లా నూతన అధ్యక్షుడిగా భక్షి శ్రీధర్‌రావును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు అల్లంనారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ శనివారం ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు. అధ్యక్షుడిగా కొనసాగుతున్న పోతుల రామును రాష్ట్ర కమిటీలోకి తీసుకుంటూ జిల్లా అధ్యక్షత బాధ్యతలను భక్షి శ్రీధర్‌రావుకు అప్పగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా భక్షి శ్రీధర్‌రావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో 370 ఓట్లు సాధించాలి


పార్టీలో చేరిన యువకులతో నారాయణ

పెబ్బేరు రూరల్: ప్రతి పోలింగ్ కేంద్రంలో 370 ఓట్లు సాంధించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో చిమనగుంటపల్లికి చెందిన యువకులు భారీగా పార్టీలో చేరారు. వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీని చూడాలన్నారు. ప్రతి కార్యకర్త 43 రోజులు పాటు నేనే పార్లమెంట్ అభ్యర్థిని అనే లక్ష్యంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను రెండు లక్షల ఓట్ల మెజార్టీతో విజయం సాధించాలని, అందులో వనపర్తి నియోజకవర్గం అగ్రభాగంగా ఉండేలా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుమారస్వామి, బాశెట్టి శ్రీను, పెద్దిరాజు, శ్రీనివాస్‌గౌడ్, కదిరె మధు, రవి నాయక్, దేవేందర్, వాకిటి సుదర్శన్, పోతు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించాలి

పాన్‌గల్: తీవ్రమైన ఎండలతో కలిగే అనర్థాలను వివరిస్తూ వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వడదెబ్బ నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, మాత శిశు సంరక్షణ, క్షయ, కుష్ఠు వ్యాధుల నిర్మూలన, అసంక్రమిత వ్యాధుల నివారణపై వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వైద్య సేవల కార్యక్రమాల వివరాలను అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

వీపనగండ్ల: వేసవిలో గ్రామాల్లోని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా అందుతున్న వైద్య సేవల గురించి తెలియజేస్తూ పసిపిల్లలు, బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని ఆదేశించారు.

మల్లు రవికి సన్మానం


మల్లు రవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి జోగులాంబ గద్వాల జిల్లాలో జరుగుతున్న గద్వాల, అలంపూర్ నియోజకవర్గ బూత్‌లెవల్ ఏజెంట్ల శిక్షణ తరగతుల కార్యక్రమానికి వెళ్తూ పెబ్బేరు బైపాస్‌లోని ఓ దాబా వద్ద ఆగాడు. ఈ సందర్భంగా ఆయనను పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీకి చెందిన నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసుగౌడ్, మాజీ సర్పంచు సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, గంధం రాజశేఖర్, కౌన్సిలర్ సత్యనారాయణ, షకీల్, బీరం రాజశేఖర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



మదనాపురం: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మదనాపురం మండల వడ్డెర సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డె కృష్ణ మాట్లాడుతూ వడ్డెరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో వడ్డె శాంతన్న, వడ్డె శేఖర్, రాజు, వడ్డె బాలస్వామి తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం

పెబ్బేరు రూరల్: కొత్తకోట ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కరుణను పెబ్బేరు గౌడ సంఘం నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకేను ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాజశేఖర్‌గౌడ్, దామోదర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాజుగౌడ్, భాస్కర్‌గౌడ్, వెంకట్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

అమరచింత: తన కుమార్తె కనిపించడం లేదంటూ తల్లి కతలమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్ఐ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారని వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ ధర్నా


అమరచింత ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

ఆత్మకూర్: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

అమరచింత: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలంటూ పంచాయతీ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలిచాలనీ వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణ భారమై అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపరించాయన్నారు. అధికారులు వెంటనే స్పందిస్తూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కురుమన్న, మల్లేష్, కథలన్న, నరసింహ, మొగిలి శ్రీను, నాగన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల దొంగలపై నిఘా ఉంచాలి

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల రైతుల పంట పొలాల వద్ద ఉన్న మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్తున్నారని, వీటిపై పోలీసులు నిఘా వేసి ఉంచాలని రైతు కావలి మహేష్ పోలీసు అధికారులకు విన్నవించారు. తమ పొలం వద్ద మోటార్‌లకు అమర్చి ఉన్న 20 మీటర్ల కేబుల్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని ఆయన ఆవేదన చెందారు. గతంలో కామదేనుపల్లి శివారులోని డీ28 జూరాల కెనాల్‌లో కటికె శ్రీనివాసులు అనే రైతుకు చెందిన 5 ఆస్వర్ల మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని, ఈ సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా.. ఇప్పటికీ చోరీకి పాల్పడిన వారిని గుర్తించలేదని వాపోయారు. ఇప్పటి నుంచైనా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు నష్టం జరుగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వృద్ధుడు అదృశ్యం

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని దండుగడ్డ కాలనీకి చెందిన జయప్రకాష్ కులకర్ణి ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా అప్పరాలకు డోకూర్ బాలస్వామి(65) ఈనెల 25న బాలస్వామిని పనికి కుదిరాడు. 26న ఉదయం వాచ్‌మెన్ బాలస్వామి కనిపించకపోవడంతో యజమాని జయప్రకాష్ కులకర్ణి అప్పరాల గ్రామంలోని లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి వాచ్‌మెన్ సమాచారం ఇవ్వడంతో పాటు గ్రామానికి వెళ్లి వెతకగా ఆయన కనిపించలేదు. ఈ మేరకు ఇంటి యజమాని జయప్రకాష్ కులకర్ణి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

మోదీతోనే దేశ అభివృద్ధి


వాకర్స్‌తో మాట్లాడుతన్న పోతుగంటి భరత్

పెబ్బేరు రూరల్: బీజేపీకి మద్దతుగా నిలువాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ శనివారం వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బచ్చురాం ఆధ్వర్యంలో ఉదయం వనపర్తి పట్టణంలోని జూనియర్, పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో, ఏకో పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను కలిశారు. ఈ సందర్భంగా భరత్‌ప్రసాద్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ వేగంగా అభివృద్ధి చెందాలంటే మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ గద్దెనెక్కాల్సిన అవసరం ఉందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాయకులు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి, రామన్‌గౌడ్, సీతారాములు, సుమిత్రమ్మ, కుమారస్వామి, వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

భార్యను హతమార్చిన భర్తపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: ఇతరులతో భర్తకు వివాహేతర సంబంధం ఉందని విసిగిస్తున్న భార్యను హతమార్చిన భర్తపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ నాగభూషణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని ఎద్దులగేరికి చెందిన వెంకటేష్‌కు పద్మ అలియాస్ మహేశ్వరితో 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటేష్‌కు ఇతరులతో వివాహేతర సంబంధం ఉందని అనుమానం పెట్టుకొని రోజు విసిగిస్తుండంతో భార్యభర్తల మధ్య నిత్యం గొడవ జరిగేది. ఈ నెల 15 రాత్రి వారి మధ్య గొడవ జరగగా.. భార్య ముఖంపై దిండు పెట్టి ఊపిరి ఆడకుండ చేసి గొంతు నులిమి చంపేశాడు. ఘటనపై వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి ఈ నెల 16 అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. శనివారం డాక్టర్ ఇచ్చిన పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా ఎద్దుల వెంకటేష్‌పై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పట్టపగలే దొంగతనం

ఖిల్లాఘనపురం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన ఖిల్లాఘనపురంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన భారతమ్మ శనివారం మధ్యాహ్నం సమయంలో ఇంటికి తాళం వేసి తెలుగు గేరిలోని తన చెల్లెలు గౌరమ్మ ఇంటికి వెళ్లింది. ఆమె కొంతసేపటికి తిరిగి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి కనిపించాయి. ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా.. ఇంట్లో దాచి ఉంచిన రెండున్నర తులాల బంగారు ఆభరణం కనిపించలేదు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు


అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా వారి ముఖాల్లో సంతోషంతో పాటు పదేళ్ల పాటు కలిసి చదువుకున్న మిత్రులను వదిలి వెళ్తున్నామనే బాధ కొట్టిచ్చినట్లు కనబడుతున్నాయి. తమ మిత్రులు మరోసారి కలుస్తారో లేదోనని కలవరం వారిలో కనబడుతుంది. అనంతరం హాస్టళ్ల నుంచి ఇంటికి వెళ్లడానికి వచ్చిన విద్యార్థులతో బస్టాండ్లు కోలాహలంగా మారాయి.

99.69శాతం హాజరు

శనివారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షకు 6,906 మంది విద్యార్థులకు గాను 6,885 మంది విద్యార్థులు హాజరుకాగా, 21 మంది గైర్హాజరయ్యారని జిల్లా అధికారులు తెలిపారు. శ్రీరంగాపురం మండలంలో ఆర్‌జేడీ వెంకటనర్సమ్మ ఆకస్మిక తనిఖీలో ఇద్దరి విద్యార్థులు డిబార్ అయ్యారు.


ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాల వద్ద..


కిక్కిరిసిన వనపర్తి బస్టాండ్ ప్రాంగణం

'పట్టణాల్లో ఓటింగ్ శాతం పెరగాలి'



వనపర్తి టౌన్: భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన పౌరులకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించిందని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విద్యార్థినులకు స్వీప్ యాక్టివిటీస్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. సరైన నాయకుడిని ఎంచుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కుటుంబం, గ్రామం, ఇంటి పక్కన వారికి ఓటు హక్కు ప్రాముఖ్యత తెలియజేసే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఓటింగ్ శాతం బానే ఉందని, పట్టణాల్లో మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సీఎం రామ మహేశ్వర్ రెడ్డి, డీసీపీఓ రాంబాబు, డీహెచ్‌డబ్ల్యూ కోఆర్డినేటర్ భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ పాల్గొన్నారు.

రాములుకు నివాళి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన యూటీఎఫ్ సీనియర్ నాయకుడు రాములు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, సీపీఎం ఆధ్వర్యంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కిల్లె గోపాల్, రాములు, డాక్టర్ మురళీధర్ తదితరులు శనివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు చిత్రపటం అందజేత



అమరచింత: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాన్ని పెన్సిల్‌తో గీసి, దాని ఫ్రేమ్‌ను శనివారం ఎమ్మెల్యేకు అమరచింతకు చెందిన ప్రవళిక అందించింది. పట్టణానికి చెందిన నామాల ప్రవళికకు చిత్రలేఖనంపై ఆశక్తి ఉండటంతో పలు దేశ నాయకుల చిత్రపటాలతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకుల చిత్రపటాలను పెన్సిల్‌తో వేయడంలో అందేవేసిన చెయ్యి. ఈక్రమంలో మక్తల్ నియోజకవర్గంలో బీసీ వర్గం నుంచి మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించిన వాకిటి శ్రీహరి చిత్రపటం గీసి బహూకరించింది. తనపై అభిమానంతో చిత్రపటం గీసి బహూకరించిన నామల ప్రవళికను ఎమ్మెల్యే అభినందించారు.

హెల్త్ సెంటర్‌కు తాగునీటి సౌకర్యం



సాక్షి ఎఫెక్ట్..

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో తాగునీటి సమస్యపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో జల గోస పేరుతో కథనం ప్రచురించారు. దీనికి స్పందించిన అధికారులు శనివారం ఆస్పత్రి ఆవరణలో ఉన్న బోరు నుంచి ఆస్పత్రికి నీటిని అందించే సంపునకు కాల్వలు తవ్వి ప్రత్యేక పైపులను అమర్చి తాగునీటిని అందించే చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు, ఆస్పత్రికి వచ్చే రోగులు 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పౌరసేవలపై అవగాహన



అమరచింత: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులు, సేవలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండి, వాటిని వినియోగించుకోవాలని ఆర్ఐ గోపాల్, ఏఎస్ఐ వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని నందిమళ్లలో శనివారం సివిల్స్ రైట్‌డే కార్యక్రమం సందర్భంగా గ్రామ ప్రజలకు పౌరసేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలను ప్రజల ఆస్తులుగా భావించి అవి అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రశంసాపత్రం అందజేత



కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని నాంపల్లిలో మీడియాప్లస్ ఆడిటోరియంలో పర్యావరణ్ ఎన్‌జీఓస్ నెట్‌వర్క్ కన్వీనర్ విజయ్‌బాబు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నాగేశ్వర్‌రావు, ప్రసన్నకుమార్ పర్యావరణ పరిరక్షణాన్ని కాపాడుదాం అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు పట్టణ కేంద్రంలోని జీఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్ హాజరయ్యారు. ప్లాస్టిక్‌ను నివారించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఎలా పనిచేయాలి అని సూచించడంతో పాటు ప్లాస్టిక్ వాడకంపై కలిగే నష్టాల గురించి వారు వివరించారు. వచ్చే నెలలో పట్టణ కేంద్రంలోని ప్రతి ఇంటికి బట్ట బ్యాగులను కొత్తకోట మున్సిపల్ అధికారులతో కలిసి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. వర్క్‌షాపులో పాల్గొన్నందుకు సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు.

బొడ్రాయికి పూజలు



ఖిల్లాఘనపురం: మండలంలోని వెంకటాంపల్లిలో శనివారం బొడ్రాయి (నాభిశిల) ద్వితీయ వార్షికోత్సవాన్ని ప్రజలు కనులపండువగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచు దంపతులు అరుణ, సురేందర్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి బొడ్రాయికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయం వద్ద హోమాలు చేయడంతో పాటు సాయంత్రం బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. వేదపండితులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలను గ్రామస్తులతో చేయించారు. గ్రామ సుభిక్షం ఉండాలని వేడుకున్నారు.